రైతు వ్యతిరేక విధానాలు ఆపండి

రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్

విశాలాంధ్ర - బెలగాం: రైతాంగానికి, వ్యవసాయ రంగానికి నష్టం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలు వెనక్కి తీసుకోవాలని రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు డిమాండ్ చేసారు. లేదంటే మరోసారి ఢిల్లీ తరహా పోరాటం తప్పదని స్పష్టం చేసారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి డి.వర్మ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకురాలు పి.రమణి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణ మూర్తి, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి. రంజిత్ కుమార్‌లు మాట్లాడుతూ అన్ని పంటలకు మద్దతు ధరల అమలు చట్టం చేయాలని డిమాండ్ చేసారు. రైతులు, కౌలు రైతులు వ్యవసాయ కార్మికులకు రుణ మాఫీ చేయాలని, 60ఏళ్ళు నిండిన వారికి నెలకు 10 వేలు పెన్షన్ ఇవ్వాలని, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తేవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ బంటు దాసు, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు పి. శ్రీను నాయుడు, యు.ముత్యాలు, ఎం.భాస్కర్ రావు (భాష), అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు జె.ముత్యాలు, ఏపి రైతు సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరావు, అయ్యార్ల సంఘం నాయకులు ఎన్.ఆదినారాయణ, జి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - బెలగాం: అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, షాపింగ్ మాల్‌లలో అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం అధికారి జి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో బుధవారం పార్వతీపురం మెయిన్ రోడ్డులో గల షాపింగ్ మాల్ అయిన స్టైల్ బజార్ వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకరరావు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం డ్రైవర్ ఆపరేటర్ ఎం. చిన్నయ్య, ఫైర్ మెన్‌లు టి.త్రినాథరావు, ఎ.తిరుపతి నాయుడు, షాపింగ్ మాల్ అయిన స్టైల్ బజార్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మిపురం: జీడి మామిడి(పిక్కలు) పంట క్వింటాకు 20 వేల రూపాయలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన లేవిడి రబ్బరు తోటలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రికను ఆవిష్కరించారు. జీడి మామిడి ప్రాసెసింగ్ యూనిట్లను, ఉత్పత్తుల సంస్థలను ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, జీడి పరిశోధనా కేంద్రాలను ప్రాంతాలవారిగా ఏర్పాటు చేసి నాణ్యమైన అధిగ దిగుబడులను ఇచ్చే మొక్కలను అందించాలని డిమాండ్ చేశారు. 10వ తేదీన జరిగే సదస్సుకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పువ్వుల ప్రసాద్, మండంగి సింగన్న, రామ్మూర్తి తాతారావు, గరుగుదల్లి సూరయ్య, గుజ్జ జనార్ధన తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

సీఐలు రామకృష్ణ, అప్పలనాయుడు

విశాలాంధ్ర - సాలూరు: వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రత నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మీకై మేము వెల్ఫేర్ అధ్యక్షుడు ఇప్పిలి దిలీప్ కుమార్‌ను సాలూరు పట్టణ,గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్‌లు అప్పలనాయుడు, రామకృష్ణలు అన్నారు. బుధవారం స్థానిక బోసుబొమ్మ జంక్షన్ వద్ద మీకై మేము వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిఐలతో పాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఏటా 100 రోజుల పాటు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ, త్రాగునీరు అందిస్తున్న మీకై మేము సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మీకై మేము సభ్యులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే ప్రాధాన్యం: ఎస్పీ

విశాలాంధ్ర - పార్వతీపురం: మహిళల భద్రతే ప్రాధాన్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని, దీనిలో భాగంగానే రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు మార్చి 8న జరగబోవు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి తెలిపారు. బుధవారం మహిళలు, విద్యార్థులు, అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా సాధికార వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్, మెడికల్ క్యాంపస్, ఆటలు/చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, వక్తృత్వ, ఉపన్యాసం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కనకదుర్గ, పార్వతీపురం టౌన్ సీఐ మురళీధర్, పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, ఎస్సైలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

శరవేగంగా పాఠశాల ప్రహరీ నిర్మాణం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఆర్)లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రు.13 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నిర్మాణం ప్రారంభించిన అనతి కాలంలోనే గోడ ప్లాస్టింగ్ దశకు చేరుకోవడంతో గుత్తేదారులకు గ్రామ ప్రజలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంట్రెడ్డి శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ గుంట్రెడ్డి వెంకట అనంతరావు, క్షేత్ర సహాయకులు వావిలవల్లి వరాహాల నాయుడు, పప్పల సత్యం నాయుడు, రేవల్ల సీతారాం నాయుడు, రేవల్ల రామమూర్తి నాయుడు (రాముమాస్టర్) తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివి ఉత్తీర్ణత సాధించాలి

ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర - కొమరాడ: పదవ తరగతి చదివే విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ ఆకాంక్షించారు. ఏపీ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం పీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలంటే పదో తరగతి పునాది అని, శ్రద్దతో విద్యను అభ్యసించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం ఇష్టంతో చదివి ఉత్తీర్ణత పొందాలని అభిలాషించారు. అనంతరం పిల్లలకి అందిస్తున్న మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, వసతి గృహం వార్డెన్, సీతారాం ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీతంపేట: మండలంలోని మర్రిపాడు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. జెమ్స్ వైద్యాధికారులు, విజయ ఆసుపత్రి, సీతంపేట ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు పాల్గొని ఉచిత వైద్యంతోపాటు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 1000 మంది పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ డి.ఎస్.పి ఎం.రాంబాబు, సిఐ చంద్రమౌళి, ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో పాల్గొన్న ప్రజలకు భోజన సౌకర్యం, ఉచిత వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇమరక పవన్, సర్పంచ్ చలపతి పాల్గొన్నారు.

పిఎం జన్‌మాన్ ఇళ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కురుపాం: ప్రధాన మంత్రి జన్ మాన్ ఇళ్ళు నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని మన్యం జిల్లా హౌసింగ్ పిడి డాక్టర్ రామచంద్ర రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండలంలోని రస్తాకుంటుబాయి, గొటివాడ గ్రామాలలో ప్రధానమంత్రి జన్ మాన్ పథకంలో ఇళ్ళు మంజూరై నిర్మాణం చేపట్టిన ఇళ్లను పరిశీలించారు. నేటికీ ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురుపాం సబ్-డివిజన్ డిఈఈ ఎన్.వెంకటరావు, సహాయక ఇంజినీరు జి.అచ్చయ్యమ్మ, వర్క్ ఇన్స్పెక్టర్ ఎస్.రాజేష్, పి.సోమశేఖర్ పాల్గొన్నారు.

మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 1 నుండి 8 వరకు కూడా వారోత్సవాలు జరిపించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వారి నుండి ఆదేశాలు జారీ చేసియున్నారు. అందులో భాగంగా బుధవారం మండలంలో కాశీపట్నం కస్తూరిబా స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాచిపెంట సీడీపీఓ బొత్స



అనంతలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మగవారికి దీటుగా ప్రతి రంగంలో అవకాశాలు అందుపుచ్చుకోవడానికి అవకాశాలు ఉన్నాయని ఉదాహరణలతో సహా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపాల్ నాగదుర్గ, ఉపాధ్యాయులు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.రాజశ్రీ, మహిళా పోలీస్ పి.రేవతి, అంగన్వాడీ కార్యకర్త ఏ. లలిత పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - బలిజిపేట: బలిజిపేట మండలం ప్రజాసంఘాల కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి ప్రాజెక్టు నాయకురాలు కే.దాదమ్మ, ఏఎస్ఐ రమణ, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు ఇందిరా, ఐసిడిఎస్ సూపర్వైజర్ బి.పద్మ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలైనా ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై వేధింపులు జరుగుతున్నాయన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన స్థానం కల్పించాలని అన్నారు. మహిళలకు సాధికారిత సాధించాలన్నా సమానత్వం రావాలన్నా ప్రభుత్వ ఆలోచన విధానాలలో మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, రామ్‌బయమ్మ, లక్ష్మి, వీరమ్మ, భవాని, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కురుపాం: మార్చ్ 14వ తేదీన జరగబోవు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను విజయవంతం చేయా లని కోరుతూ కురుపాం నియోజకవర్గం సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంపులూరు గంగులయ్య మాట్లాడుతూ 11 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత అధికారంలోకి వచ్చి చేసుకుం టున్న ఆవిర్భావ సభని విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గం సమన్వయకర్త నిమ్మక నిబ్రహం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జానీ, కురుపాం, పాలకొండ నియోజక వర్గాల సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శులు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ డా. ఎం.జె.అభిషేక్ గౌడ

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతకు సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె.అభిషేక్ గౌడ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 100 మంది గిరిజన యువతకు వేపగుంట యూత్ శిక్షణా కేంద్రంలో శిక్షణ అందిస్తా మన్నారు. ఈ నెల 6వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు పంపిణీ చేసి స్వీకరిస్తామన్నారు. 13వ తేదీన దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిస్తుం దన్నారు. 16వతేదీన దరఖాస్తు చేసిన అభ్యర్థులకు మొదటి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి స్క్రీనింగ్ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులకు 20వ తేదీ నుండి 22 వరకు రెండవ స్క్రీనింగ్ టెస్టుకు హాలు టికెట్లు జారీ చేస్తారని పేర్కొన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ గిరిజన యువతకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన తహశీల్దార్

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి తహశీల్దార్ రామకృష్ణ దారకొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టులు క్షుణ్ణంగా చదవగలుగుతున్నారా లేదా అని పరిశీలించారు. ఇంగ్లీషు 30 శాతం మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారని తెలిపారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు విజయవంతం చేయండి

గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ

విశాలాంధ్ర - పాడేరు: అఖిల పక్ష రాజకీయ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ఎదుట ఈనెల 6,7 తేదీల్లో చేపట్టే నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70 చట్టంపై అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ 48 గంటల బంద్ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, 1/70 చట్టంపై రద్దు చేసే ఆలోచన లేదని ఎక్స్ వేదికగా ద్వారా ప్రకటించడం హర్షిస్తున్నాం కానీ ఆదివాసి ప్రాంతం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ఆదివాసి ప్రాంతం అడవులంతా అధాని, అంబానీ కట్టబెట్టి ఆదివాసులకు నిర్వాసితులుచేసే కుట్రలో పాల్గొంటుందన్నారు. 1/70 చట్టంపై అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని, ఆదివాసులకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు క్షమాపణ చెప్పాలన్నారు. అసెంబ్లీ సమావేశాలలో జీవో నెంబర్ 3 కనీసం ప్రస్తావన లేకపోవడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తూ ఆదివాసి ప్రాంతంలో ఆదివాసులకు ఉద్యోగాలు ఉండేలా తమ ప్రభుత్వం వస్తే కట్టుబడి ఉంటామని అరకు సభలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడిన పరిస్థితి ఉందని, 100శాంతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ చట్టంని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని, బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు 17 వేల కోట్లు కేటాయించాలన్నారు.

కార్యాలయాల్లో ఫీడింగ్ గదులు ఏర్పాటు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: ప్రభుత్వ కార్యాలయాల్లో శిశువుకు పాలించే గదులను మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేశారు. స్థానిక సీడీపీవో నీలిమ సిబ్బందితో మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాల్లో ఫీడింగ్ గదులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు, కార్యాలయ పనుల నిమిత్తం వచ్చే బాలింతలకు ప్రత్యేకంగా ఫీడింగ్ గదులను ప్రభుత్వం ఆదేశాలతో కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహశీల్దార్ ముజీబ్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

7న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండలో ఈ నెల 7న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని జీకేవీధి సీఐ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారకొండ వైద్య సిబ్బంది, పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దారకొండ, గుమ్మిరేవుల, దుప్పుల వాడ, గాలికొండ, సీలేరు పంచాయతీల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో పరీక్షలను నిర్వహించి ఎవరికైనా క్యాటరేట్ ఆపరేషన్లు అవసరమని వైద్య నిపుణులు సూచిస్తారో అటువంట వారిని ఉచితంగా ప్రత్యేక వాహనంలో తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయించి మరలా ఉచితంగా వారి స్వగ్రామాలకు పంపిస్తామని సీఐ తెలిపారు.

30కిలోల గంజాయి స్వాధీనం: ఒకరు అరెస్టు

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఏజెన్సీ నుంచి మైదానానికి తరలిస్తున్న 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకునట్లు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. బుధవారం స్థానిక కొత్తూరు కూడలిలో వాహనాలు తనిఖీలు చేపడుతుండగా కాలినడకన నడుచుకుంటూ వస్తుండగా అనుమానంతో తనిఖీ చేయాగా

గోని సంచిలో 30కిలోల గంజాయి గుర్తించామన్నారు. దీంతో మండలానికి చెందిన వంజరి పంచాయతీ గొప్పులపాలెం గ్రామానికి చెందిన గొల్లోరి పొదల అనే నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి నట్లు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవివి ప్రసాద్‌ను అభినందించిన మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర - కొయ్యూరు: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజానగరం నియోజవర్గం అబ్జర్వర్‌గా పనిచేసిన చింతపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత ఎంవివి సత్యనారాయణ తనయుడు మాజీ గిరిజన సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎంవివి ప్రసాద్ ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశేష ప్రతిభ కనబరిచినందుకుగాను రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు అయిన అనంతరం మర్యాద పూర్వకంగా మంత్రి నారా లోకేష్‌ను బుధవారం అమరావతిలో కలిశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి అయిన పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ఎంవివి ప్రసాద్ విశేష కృషి చేయడంతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాడేరు నియోజకవర్గంలో టీడీపీ బలో పేతంపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం నియోజవర్గంలో ప్రధాన సమస్యల గురించి వివిధ అభివృద్ధి సంక్షేమం కోసం మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు.

గిరిజనేతరులకు గిరిజన ప్రాంతంలో ఎటువంటి హక్కులు లేవు

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌పై ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు జాతీయ ఎస్టీ కమిషన్‌కు వేసిన ఎన్‌సిఎస్‌టి, డిఈవి -2553 కేసులో భాగంగా బుధవారం జాతీయ కమిషన్ ముందర నాగేశ్వరరావు హాజరయ్యారు. నాగేశ్వరరావు బావయోగి అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఎస్టీ కమిషన్‌కి భూమి డాక్యుమెంట్స్ సాక్ష్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ పరిశీలించి కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ఏరియాలో నాన్ ట్రైబల్ సంఘాలు పెట్టుకోవడం, నాన్ ట్రైబల్ దేవాలయాల పేరుతో భూములు పొందడం 1/70 చట్టానికి విరుద్ధం అని, ఏజెన్సీ ఏరియాలో ట్రైబల్‌కు తప్ప నాన్ ట్రైబల్‌కు హక్కులు లేవని ట్రైబల్‌ను ఇబ్బదులు పెట్టే కార్యక్రమాలు చేయరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గెమ్మెల బొంజుబాబు, కిల్లో రాజారావు, సోమేల బాలరాజు, వంతల వికాస్, పాంగి సోన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిణి డాక్టర్ లక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి: ఆసుపత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిణి (డిసిహెచ్ఎస్) అన్నారు. అల్లూరి జిల్లా డిసిహెచ్ఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె మొట్టమొదటి సారిగా చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన ఆమె ఆసుపత్రిలో వైద్యుల పనితీరుపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా రోగుల దగ్గరికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. అదే క్రమంలో ఆసుపత్రి ల్యాబ్‌లో రక్తపరీక్షల వివరాలను, శిశువుల (ఎస్ ఎన్ సి యూ) వార్డ్‌లో నవజాత శిశువులకు అందుతున్న సేవలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు సిబ్బందితో విడివిడిగా మాట్లాడి ఆసుపత్రిలోని సమస్యలను, మందుల నిల్వలను అడిగి తెలుసుకున్నారు. నిపుణులైన వైద్యుల నియామకానికి కమిషనర్‌తో మాట్లాడతానని తెలిపారు. నూతనంగా నిర్మాణం అవుతున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ ప్రదేశానికి వెళ్లి అక్కడున్న ఇంజనీర్‌తో ఆసుపత్రి ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరిండెంటెంట్ పద్మావతి, వైద్యులు డాక్టర్ రుక్మిణి, డాక్టర్ భారతి, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ లావణ్య, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సాయి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా సరే ప్రజల చూపు కూటమి వైపే....

రాష్ట్ర జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర - అనంతగిరి: ఎన్నికలు ఏవైనా సరే ప్రజల చూపు కూటమి వైపే ఉందని రాష్ట్ర జీసీసీ చైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీ శివలింగ పురం గ్రామంలో అనంతగిరి మండల నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. పట్టభద్రుల ఎమెల్సీ ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించిన పట్టభద్రుల అందరికీ ధన్యవాదములు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నిరుద్యోగులు ఉపాధి ఉద్యోగుల అవకాశాలు కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యమని ప్రజా సమస్యలు పరిష్కరించే సత్తా కూటమి ప్రభుత్వానికే ఉందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం విజన్ ఉన్న నాయకుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, దావోస్ వెళ్లి కంపెనీలతో మాట్లాడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారని అన్నారు. ఉద్యోగస్తుల సమస్యలు రైతులు నిరుద్యోగుల పరిష్కారం కావడానికి కూటమి ప్రభుత్వం నమ్మకం ఉంచి

ఎమ్మెల్సీ అభ్యర్థిల గెలుపునకు ప్రతి ఒక్క పట్టభద్రుడు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, వైస్ జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ జోగులు నిర్మల, యూనిట్ ఇన్‌చార్జులు బిడ్డ లక్ష్మణ్ దేముడు, సుందరరావు, నేగలీ సమర్థి, దొన్ను, హరి, బూత్ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీటీసీ దేముడు, మాజీ సర్పంచ్ దొన్ను, మాజీ టీడీపీ నాయకులు వీరమల్లు, శివ, సన్ని బాబు, తిరుపతిరావు, శ్యామ్, మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కాష్ ప్రోగ్రామ్ ప్రారంభించిన ఎంపీపీ

విశాలాంధ్ర - కొమరాడ: వేసవికాలం దృష్టిలో పెట్టుకొని బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కాష్ ప్రోగ్రాంను ఎంపీపీ శెట్టి శ్యామల చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ జడ్పిటిసి సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మి పాల్గొని మాట్లాడారు. మండలంలో మొత్తం 31 పంచాయతీలో ప్రతి గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా క్రాష్ ప్రోగ్రాం ద్వారా చర్యలు చేపడతామని ఆమె అన్నారు. ఎంపీడీవో మల్లికార్జునరావు చెప్పిన వివరాలు ప్రకారం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ ఆదేశాల ప్రకారం కాష్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని సుమారు 5 లక్షలు నిధులు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ కన్వీనర్ ద్వారపు రెడ్డి జనార్ధన, ఈవోపీఆర్డి ఎం.రాధాకృష్ణ, ఇన్‌చార్జ్ ఆర్డబ్ల్యూఎస్ జేఈ జి.గౌరీ శంకర్రావు. మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: రాష్ట్రంలో శోభాయమానంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జిల్లా అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, అధికారులతో బుధవారం విజయవాడ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ వేడుకలకు మహిళా మంత్రులు, ప్రజాప్రతినిధులతో పాటు ఇతర ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారంతో ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న రక్షణ, భద్రత, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. వేదిక వద్ద వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటుచేయాలని, వివిధ రంగాల్లో రాణించిన మహిళలను గుర్తించి, వారిని సత్కరించాలని తెలిపారు. మహిళా లబ్దిదారులను ఎంపిక చేసి రుణాలు, బ్యాంకు లింకేజీల చెక్కులు, ఉపకరణాలను పంపిణీ చేయాలని సూచించారు. వేదిక శోభాయమానంగా ఉండాలని, ఉత్సవాన్ని తలపించేలా కనిపించాలని అన్నారు. సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సమావేశం అనంతరం అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వీలుగా వేదికను సిద్ధం చేయాలని అన్నారు. ఆహ్వాన పత్రికలను ముద్రించి మంత్రులు, ప్రజాప్రతినిధులను, అధికారులను ఆహ్వానించాలని అన్నారు. ప్రతి ఒక్కరికీ ముందస్తు సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. మహిళా పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన నారీమణులకు సత్కారం చేయాలని అన్నారు. వేదిక వద్ద వివిధ రకాల స్టాళ్లతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ప్రత్యక్ష ప్రసారాన్ని అందరూ తిలకించేలా డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా. టి.కనకదుర్గ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పథక సంచాలకులు సుధారాణి, వై.సత్యంనాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ యం.వి.కరుణాకర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ అధికారి డా.టి జగన్మోహన రావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

విశాలాంధ్ర - పార్వతీపురం /పార్వతీపురం టౌన్: మన్యం జిల్లాలో గల గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో గురుకుల పాఠశాలల సమస్యలపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలను టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ ఎన్టీ రామారావు తీసుకొచ్చారన్నారు. ఒకప్పుడు గురుకుల పాఠశాలలో సీటు దొరకాలంటే చాలా కష్టంగా ఉండేదని, ఎందుకంటే అప్పట్లో ఎన్నో మౌలిక వసతులు కలిగి ఉండేవని, అందుచేత తల్లిదండ్రులు గురుకులాల్లో తమ పిల్లలను చేర్పేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఒకప్పుడు 60 సీట్లకు సుమారు 500 మంది వరకు పోటీ పడే వారని, నేడు వసతులు లేని కారణంగా వెలవెలబోతున్నాయని అన్నారు. ఏ గురుకుల పాఠశాలలో చూసిన డార్మెటరీలు లేవు, బెడ్లు సరిగ్గా లేవు, కనీసం కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేని దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే స్పందించి గురుకుల పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 394 మంది గైర్హాజరు

జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖఅధికారి మంజులవీణ

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీ డియట్ విద్యాశాఖ అధికారి డి.మంజులవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సంబంధించి జిల్లాలో సాధారణ కోర్సుల విద్యార్థులు 175 మంది, వొకేషనల్ విద్యార్థులు 219 మంది ఆబ్సెంట్ అయినట్లు తెలిపారు. జిల్లా ఎగ్జామినేషన్ కమిటీతోపాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేసాయన్నారు. ఈ పరీక్షా కేంద్రాల్లో 461 సీసీ కెమెరాలు అమర్చడం జరిగిందని, పరీక్షలను జిల్లా ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్‌లు పర్యవేక్షణ చేశాయన్నారు.

మహిళ సాధికారతపై అవగాహన

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్థానిక పోలీస్ డిపార్ట్మెంట్, కళాశాల మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం, సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గా ప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ రమేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు చరవాణిలు ద్వారా తమ, తమ సొంత విషయాలను ఇతరులకు పంపడం ద్వారా నేరాలు జరుగుతున్నాయని, సైబర్ నేరాల బారిన పడుతున్నారని, డ్రగ్ మాఫియా నేపథ్యంలో విద్యార్థులు తమ జీవితాన్ని, భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. మహిళా సాధికారతపై జరిగిన వక్తృత్వ పోటీలో ప్రతిభ కనబరిచిన విధ్యార్థినులకు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్, అధ్యాపకులు జి.వెంకటరావు, డాక్టర్.వై.పద్మ, కె.శకుంతల, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, జి.హరతి, యన్.రమేష్, నాగమొహనరావు, రాజబాబు, బి.శ్రీనివాస రావు, మహిళా సాధికారత సమన్వయకర్త కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యం మెరుగుకు కృషి

విశాలాంధ్ర - గరుగుబిల్లి/జెలగాం: మెరుగైన ఆరోగ్య అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన పెంపొందించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు. గరుగుబిల్లి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ పాల్గొని పలు సూచనలు చేశారు. వ్యాదులు, రుగ్మతలు, అనారోగ్య లక్షణాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది ఎప్పటి కప్పుడు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ముందస్తు కార్యాచరణ చేయాలన్నారు. కిశోర బాలికలు పోషకాహార లోపం, రక్తహీనతకు గురవ్వకుండా సమిష్టి కృషి చేయాలన్నారు. సమతుల్య ఆహారం, ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు సక్రమంగా తీసుకునేలా పర్యవేక్షించాలన్నారు. బాల్య వివాహాలు, యుక్తవయస్సు గర్భిణీ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, అనర్థాలపై అలాగే సరైన వివాహ వయస్సుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ చిన్నమ్మి, ఎపెడిమిక్ ఈఓ సత్తిబాబు, సూపర్వైజర్లు ఉదయకుమారి, ప్రసాద్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సరే పర్యవేక్షణ ఏది..?

ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎక్కడ...?

మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ ధ్వజం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : నియోజకవర్గంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తుందని కురుపాం మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ వెనుకబడిన వర్గాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వారి సంక్షేమమే ధ్యేయంగా రహదారి లేని గ్రామాలు ఉండకూడదనే లక్ష్యంతో రహదారి లేని గ్రామాలకు రు.419.04 కోట్ల రూపాయలతో రహదారులు నిర్మించాలని కంకణం కట్టుకున్నారని, అయితే దీనికి పర్యవేక్షణ అధికారిగా ఐటిడిఎ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు కలెక్టర్ బాధ్యతలు అప్పగించినప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులలో ఒక్క సారైనా పర్యవేక్షించలేని పరిస్థితి అని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పనులకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్న ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిని కోరుతున్నామన్నారు.

జిల్లా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఏపీఎన్జీవో సంఘం కార్యాలయంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఏ.తిరుపతిబాబు, విజయనగరం జిల్లా అధ్యక్షులు కేఎస్. అప్పలనాయుడు, అనకపల్లి జిల్లా కార్యదర్శి ఎం.శంకర్రావు, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కేవీ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లా ఏపీఎన్జీవో అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్ అధ్యక్షత వహించారు. ఎల్‌టి నూతన అధ్యక్షులుగా వై.తిరుపతిరావు(వీరఘట్టం పిహెచ్ సి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్.శ్రీనివాసరావు (అన్నవరం పిహెచ్ సి), ఉపాధ్యక్షులుగా పి.రాజేష్-సాలూరు, వి.మురళి-సీతంపేట, వి.నిర్మల (సీతానగరం పి హెచ్ సి), వి.చల్లారావు-కురుపాం, ఎం.గోపికృష్ణ-రావివలస, కార్యదర్శిగా ఆర్ సురేష్ కుమార్-ఆర్ఆర్‌బి పురం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.శ్రీనివాసరావు- గరుగుబిల్లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితోపాటు సహాయ కార్యదర్శులుగా బి.రాము-రేగిడి, ఏ.లీలావతి-పెదబొండపల్లి, జి.సుమన్-బెలగాం, ఏ.ఆనంద్-జి ఎస్ పేట, మహిళా సహాయ కార్యదర్శిగా ఎస్.ఆదిలక్ష్మి-డొకిశీల, కోశాధికారిగా కె.కిషోర్ పార్వతీపురం, కార్యవర్గసభ్యులుగా ఎం.అమ రావతి (బందలుప్పి పి హెచ్ సి), కె.గిరిబాబు (పెదంకలం పి హెచ్ సి), కె శరత్ కుమార్ మర్రిపాడు (పి హెచ్ సి) ఎన్నుకున్నారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా రుక్మాండయ్య పదవీ బాధ్యతలు



విశాలాంధ్ర - రంపచోడవరం: రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వారి కార్యాలయంలో నూతన డిప్యూటీ డైరెక్టర్‌గా యం.రుక్మందయ్య బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాలలో గిరిజన సంక్షేమ శాఖ డిటిడబ్ల్యూఓగా, పార్వతిపురం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కొంతకాలం పనిచేయడం జరిగిందని అదేవిధంగా రంపచోడవరం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలు, జిపిఎస్ పాఠశాలల అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలు, కార్యాలయ అధికారుల సిబ్బంది సమస్యలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరించడం జరుగుతుందని అదేవిధంగా గిరిజన ప్రాంత విద్య అభివృద్ధికి నా వంతు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయనను కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, చక్రధర్, రాజన్న, పి.భీమిరెడ్డి, విల్సన్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

అయ్యప్ప స్వామిని దర్శించుకున్న పీవీజీ కుమార్

ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళం

విశాలాంధ్ర - పాడేరు: రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా పివిజి కుమార్ బాధ్యతలు చేపట్టి మొట్టమొదటిసారిగా కుటుంబ సమేతంగా పాడేరు విచ్చేన ఆయనకు కూటమి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలకారు. అనంతరం పాడేరులో ఉన్న అయ్యప్ప స్వామి వారిని దర్శించుకుని ఆలయ అభివృద్ధి కొరకు లక్ష రూపాయల విరాళం ప్రకటించడం జరిగింది. అలాగే ఉత్తరాంధ్ర ఆరాధ దైవం శ్రీ మోదకొండమ్మ వారిని దర్శించుకుని, ఆలయ కమిటీ వర్తక సంఘం టిడిపి నాయకులతో ముచ్చటించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వివిధ సంఘాల వారు సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజన పక్షపాతి మొన్న జరిగిన బడ్జెట్ కేటాయింపులో భాగంగా గిరిజన సంక్షేమం కొరకు 8 వేల 159 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీటీజీ గిరిజనులకు 5 వేల గృహాలు మంజూరు

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాల్లో పిఎం జన్‌మాన్ పథకంలో భాగంగా పిటిజి గిరిజనులకు 5000 గృహాలు మంజూరయ్యాయని ఇవన్ని కూడా నిర్మాణంలో ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పార్వతీపురం మన్యం జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రామచంద్ర రెడ్డి తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మన్యంలో బుధవారం పర్యటించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గృహ నిర్మాణల పనితీరు ఎలా ఉంది, ఏ మేరకు ఇల్లు నిర్మాణం జరిగింది, లబ్ధిదారులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకునేందుకు తాను వచ్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. ఇంటి నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.రెండు లక్షల 39 వేల నిధులు మంజూరు చేయడం జరుగు తుందన్నారు. ప్రభుత్వం నిలిచిపోయి బిసి, ఎస్సిల ఇళ్లకు కొంత నగదు సాయం చేసే కార్యక్రమం చేస్తుందని అన్నారు. జిల్లాలో దాదాపు 18000 ఇంటి నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని వీటికి ప్రభుత్వం కొంత ఇన్సెంటివ్ ఇవ్వడం ద్వారా పనులు పూర్తి చేయడానికి వీలుంటుంది అన్నారు. పర్యటనలో భాగంగా మండలంలోని రేగల పాడు, అడ్డంగూడ, కన్నయ్య గూడా గ్రామాల్లో సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు జరుగుతున్న పనితీరు, లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రెడ్డి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 5,6 తేదీల్లో శ్రీరామ కళ్యాణ మహోత్సవాలు

విశాలాంధ్ర - పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు మండల కేంద్రం సంద్రుపుట్టు గ్రామంలో వెలసియున్న సీతారాముల కళ్యాణ మహోత్సవాలు వచ్చేనెల 05-04-2025 నుండి 07-04-2025 వరకు నిర్వహించడానికి ఆలయ కమిటీ గ్రామ పెద్దల సమక్షంలో తేదీలను ప్రకటించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా ఒంద్రు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా డి.పి శంకర్, ఉపాధ్యక్షులు పాంగి సాయికిరణ్ ,కోశాధికారిగా కోడ కోటీబాబు, సభ్యులుగా డిపి శివాజీ, డిపి శివ, పాంగీ మురలీ, డిపి వినయ్, జే.సురేష్, జే.నరేష్, ఎం.నగేష్, కే.మూర్తి, బి.స్వామి, ఎస్ అప్పలస్వామి, బి సుబ్రమణ్యం,పి నాగు, డీపీ పశుపతి, ఎల్ విజయ్, సి హెచ్ బాబీ, ఏమ్ పూర్ణచందర్, బి సింహాద్రి, పి రాజేష్, కే సంజీవ్ డీపీ లోవ రాజు , డీపీ సత్తిబాబు, పి మహేష్, బి ప్రశాంత్, కే క్రిష్ణ, వి శ్యామ్, కే శ్యామ్, పి శేషు, ఆర్ నిరంజన్, కే పూర్ణ చందర్‌లను నియమించుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డీపీ సురేష్,ప్రధానకార్యదర్శి జవ్వాది బాబూరావు, ఉపాధ్యక్షులు డీపీ రమేష్, కోశాధికారి బి బాలయ్య, సహాయ కార్యదర్శి సి హెచ్ గోపాలకృష్ణ, సభ్యులు ఏస్ శ్రీహరి, డీపీ సంతోష్ వి రఘుబాబు, గొల్లోరి రాము, గండేరు శ్రావణ్, గ్రామ పీసా కమిటీ అధ్యక్షులు డీపీ రాంబాబు,కార్యదర్శి జవ్వాధి లింగమూర్తి, గ్రామస్తులు వాసు ,వెంకట్ ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చినమేరంగిలో సిర్లి జాతర

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలో గల చినమేరంగిలో శుక్రవారం సిర్లి పోతన్న జాతర జరగనుందని ఆలయ పూజారి బొత్స జైపాల్ విలేకరులకు తెలిపారు. ఈ జాతర శుక్రవారం ఉదయం 5 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు జరుగుతుందని అన్నారు. ఈ విషయంపై భక్తులందరు గమనించి అధిక సంఖ్యలో పాల్గొని జాతరను జయప్రదం చేయాలని అయన కోరారు.

10న శ్రీ బోడ కొండమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - చింతపల్లి: అంజలి శనివారం పంచాయితీ కేంద్రంలో ఈనెల 10న (సోమవారం) శ్రీ బోడ కొండమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు అంజలి శనివారం గ్రామస్తులు, యూత్ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ బోడ కొండమ్మ అమ్మవారి విగ్రహ దాతలు కెవిఎన్ మూర్తి (సాయిరాం), లక్ష్మీ దంపతులు అందించిన ఈ విగ్రహాన్ని ప్రతిష్టించడంతోపాటు నిత్య దూప దీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించబడునని ఆ ప్రయత్నంలో పేర్కొన్నారు. అనంతరం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ

విశాలాంధ్ర - గంగవరం: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు దృష్టిలోపం కలిగినవారికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్ళజోళ్లను పంపిణీ చేయడం జరిగిందని ఆప్తాలమిక్ ఆఫీసర్ ఏసు పాదం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమం ఉన్నత పాఠశాలలో దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు బుధవారం ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలోని వివిధ ఆశ్రమ పాఠశాలలలో, మరియు జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు 1178 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగిందని వీరిలో 87 మందికి ఉండడంతో వారికి ఉచితంగా కళ్ళజోళ్ల పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ భావన, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు

విశాలాంధ్ర - పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను రైతులకు 50శాతం వరకు రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందించుటకు నిర్ణయించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మన్యం జిల్లాలో 2 కోట్ల 47 లక్షలు రూపాయల రాయితీపై వ్యవసాయ పరికరాలు అందించనుందని తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్‌లు, ఫుట్ స్ప్రేయర్స్, తైవాన్ స్పేయర్స్, ట్రాక్టర్ దుక్కి దమ్ము సెట్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్లు, పవర్ టిల్లర్లు రాయితీపై అందించబడునని తెలిపారు. గత 5 సంవత్సరాలుగా డిపార్ట్మెంట్ సబ్సిడీ పథకం కింద వ్యవసాయ యాంత్రీకరణ సబ్సిడీని పొందని సన్న /చిన్న కారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు (5 ఎకరాలు లోపు భూమి కలవారు) మాత్రమే అర్హులన్నారు.పట్టాదార్ పాస్ పుస్తకం కలిగి ఉన్న మరియు ఈ-పంటలో నమోదు చేసుకున్న వాస్తవ సాగుదారులు అర్హులని, ఆర్ఓఎఫ్ఆర్ భూములను సాగుచేస్తున్న రైతులు కూడా అర్హులని, కుటుంబానికి ఒక లబ్ధిదారుడు మాత్రమే అర్హులని, ప్రతి లబ్ధిదారునికి ఒక పనిముట్టు మాత్రమే అనుమతించబడుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందగోరు రైతులు తగు ఆధారాలతో ఈనెల 12లోగా సంబంధిత రైతు సేవా కేంద్రం వద్ద నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలన్నారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బెలగాం : ఎపి ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ గౌరవాధ్యక్షులు సవరపు రామారావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బుల్లా రాజారావు, రాష్ట్ర అధ్యక్షులు అత్తోట రవికుమార్‌లు కలసి చర్మకారుల సమస్యల మీద పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలతకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బుల్లా రాజారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రతీ జిల్లాలో లిడ్ కాప్ సంస్థకు వందల ఎకరాలు భూములున్నాయని అందులో లెదర్ పార్క్‌లు కట్టాలని ప్రతీ జిల్లాకు వెళ్లి కలెక్టర్‌ను కలసి అభ్యర్థన పత్రం ఇస్తున్నామని, ఇప్పటికి 19 జిల్లాలు పూర్తయ్యాయని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో రూ.5.5 కోట్లతో లెదర్ పార్క్ కట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధ పడిందని, పల్నాడు జిల్లాలో లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు నైజేరియా దేశస్థులు పెట్టుబడి పెట్టడానికి నారా లోకేష్‌ను కలిశారని చెప్పారు. విజయనగరం జిల్లాలో అడ్డపువలస గ్రామంలో 25 ఎకరాల భూమి వున్నదని ఈ జిల్లాలో కూడా లెదర్ పార్క్ ప్రారంభించడం ద్వారా ఈ జిల్లా మాదిగ యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరపు మాధవరావు, మాజీ ఎంపీటీసీ నైధాన నానారావు, సురగాల భాస్కరావు, కాగాడా తవిటిరాజు, యందవ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వి ఆర్ పురం బీసీ కాలనీకి చెందిన కారం బేబీ (28) అనే మహిళ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం నాలుగు గంటలకు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి భర్త కోట్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం తన భార్యకు శనివారం కాళ్ళ వాపులు, తిమ్మిర్లు వస్తున్నాయని స్థానిక రేకపల్లి వైద్యశాలకు వెళ్ళామని, అక్కడి నుంచి కోతులు గుట్ట వైద్యశాలకు వైద్యులు రిఫర్ చేశారని అన్నారు. కోతులు గుట్ట వైద్యశాలలో వైద్యులు పరీక్షించి యూరిన్ ఇన్ఫెక్షన్ ఉంది అని చెప్పారని, ఇంకా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని చెప్పి వైద్యం అందిస్తున్నారని, మంగళవారం నాటికి కాస్త మెరుగుపడిందని బుధవారం డిశ్చార్జి చేస్తామని వారు చెప్పారు అని, బుధవారం ఉదయం (తెల్లవారు జామున) నాలుగు గంటలకు నా భార్య మృతి చెందిందని ఆయన బోరున విలపించాడు. మృతురాలికి సాహితీ అనే నాలుగేళ్ల చిన్నారి, ఆరు నెలల పసికందు పాప ఉన్నారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విశాలాంధ్ర
పేజీ : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
గురువారం 6, మార్చి 2025

8న మహిళా దినోత్సవ వేడుకలు: జేసీ డా. అభిషేక్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ డా. ఎం జే అభిషేక్ గౌడ ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో జేసి మాట్లాడుతూ, నియోజకవర్గం పరిధిలో ప్రతి ఐటిడిఎలో, అదేవిధంగా మండల స్థాయిలో కూడా నిర్వహించాలని సూచించారు. జిల్లా ప్రధాన కేంద్రంలో కనీసం మూడు వేల మందితో సమావేశం ఏర్పాటు చేయాలని, వివిధ రంగాలలో నిష్ణాతులను, ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి వారిని సత్కరించాలని సూచించారు. వివిధ పథకాల లబ్ధిని అందజేసేందుకు లబ్ధిదారులను గుర్తించి వారికి బ్యాంక్ లింకేజ్, రుణాల మంజూరు ఉత్తర్వులు, చెక్కులు అందజేయా లన్నారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న కార్యక్రమం ముఖ్యమంత్రి గారి ప్రసంగాన్ని లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఓలు మండల సమావేశ మందిరాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాలలో పెద్ద ఎత్తున మహిళలను భాగస్వామ్యం చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజా ప్రతినిధులను, మహిళా ప్రజా ప్రతినిధులను, వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలు, ఎస్ హెచ్ జి మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో పని చేస్తున్న మహిళలు మహిళా దినోత్సవ వేడుకలలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, వారి విజయగాధలు వినిపించి అందర్నీ చైతన్య పరిచి మహిళా సాధికారత వైపు ప్రోత్సహించాలని జేసి కోరారు. ముందుగా అమరావతి నుండి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మాత్యులు గుమ్మడి సంధ్యా రాణి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని,మహిళా రక్షణ, భద్రత, సంక్షేమ, అభివృద్ధి కార్యకరమాలను వారికి తెలియజేయాలని, గత ఐదేళ్లుగా మహిళలు నిర్లక్ష్యానికి గురయ్యారని తెలిపారు. అదేవిధంగా మర్చి ఎనిమదవ తేదీ నుండి ఫైలట్ ప్రాజెక్ట్ గా ప్రారంభం కానున్న టైలరింగ్ శిక్షణపై అవగాహన కల్పించాలని, భవిష్యత్తులో వారికి అందించబోయే లబ్ధిని తెలియజేయాలని సూచించారు.

వైసీపీ నాయకులతో కుమ్మక్కైన మండల అధికారులు..!

విశాలాంధ్ర - కొయ్యూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్న మండల స్థాయి అధికారులు కూటమి నాయకులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం చేపట్టినట్లే సచివాలయం, మండల స్థాయి అధికారులు వ్యవహరిస్తున్నారని మండల టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక జడ్పీ గెస్ట్ హౌస్‌లో తెలుగుదేశం పార్టీ అత్యవసర మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడిపి పార్టీ స్థాపించి 42 ఏళ్ల నుండి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో అనేక కేసులు వివిధ రకాల ఇబ్బందులకు కార్యకర్తలను గురిచేసిన భయపడకుండా పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయడం జరిగిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్న మండలంలో వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు జరుగుతున్న అధికారులు ఇక్కడ ఉన్నటువంటి కూటమి నాయకులకు ఎటువంటి సమాచారం అందివ్వకుండా సచివాలయ సిబ్బంది మండల స్థాయి అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిం చారు. అలాగే నియోజకవర్గంలో పనిచేసిన కార్యకర్తలను, నాయకులను గాలికి వదిలి వైసిపి నాయ కులతో కుమ్మకై అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలులో వైసీపీ నాయకులతో కలసి నడుస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొలిసింగి సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామ్మూర్తి, అని శెట్టి చిరంజీవి, రొంగల గోవిందు, మాజీ ఎంపీటీసీ ఎలమంచిలి వరహాల బాబు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీటీసీ బి.శివరామరాజు, మండల ఉపాధ్యక్షులు ముల్లు వెంకటేశ్వర్లు, కురుజు శ్రీను, కూనిశెట్టి జోగారావు, బేతాళ అప్పన్న, అబ్బాయి రెడ్డి, సర్పంచ్ పీతా సింహాచలం, షేక్ బషీర్ ఖాన్, టిఎన్ ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు పోట్టుకూరి సన్యాసిరావు పాల్గొన్నారు.

మద్యంసేవించి వాహనాలు నడిపితే రూ.10వేలు జరిమానా

జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర - పార్వతీపురం: మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడితే నేరాన్ని న్యాయ స్థానాలు తీవ్రంగా పరిగణించి, ఇటీవల కాలంలో వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తున్నారని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డితెలిపారు. జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీవాహనదారులను హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పార్వతీపురం టౌన్ సిఐ ఆధ్వర్యంలో టౌన్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై మంగళ బుధవారాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈప్రత్యేక డ్రైవ్లో రెండు రోజులలో 14మంది మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పోలీసులకుపట్టుబడ్డారన్నారు. వీరిని పార్వతీపురం అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా, ఎ.జె.ఎఫ్.సి.ఎం. మెజిస్ట్రేట్ సౌమ్య జోషఫిని ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ. 1.40 లక్షలను జరిమానాగా విధించారని, రెండోసారి మద్యం సేవించి వాహనం నడిపి దొరికినట్లయితే మూడునెలలు జైలు శిక్ష విధించబడుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. వాహనదారులు గమనించి రోడ్డునిబంధనలను పాటించడంతోపాటు మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

అధికారులపై కోర్ట్ ధిక్కారణ కేసు వేస్తాం

ప్రజా ప్రతినిధులను పిలవకుండా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు తగదు

మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర - సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ, ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఇంజనీరింగ్ అధికారుల తీరు అడ్డగోలుగా ఉందని వారి తీరు మార్చుకోవాలని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర హితవు పలికారు. ప్రజల చేత ఎన్నుకోబడిన గిరిజన ప్రజాప్రతినిధుల పట్ల అధికారులు చిన్నచూపు చూడటం తగదన్నారు. బుధవారం పాచిపెంట మండల గిరిజన ప్రజాప్రతినిధులతో కలసి తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు జరుపుతున్న శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు స్థానిక సర్పంచ్‌లను పిలవక పోవడం శోచనీయమన్నారు. సర్పంచ్‌లకు తెలియజేయాలని గిరిజన సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నిస్తే వారిపై నిర్లక్ష్య ధోరణితో దురుసుగా ప్రవరిస్తున్నారన్నారు. పాచిపెంట మండలంలో ఉపాధి హామీ పథకంలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అల్లువాడ గోపాలకృష్ణ, సాలూరు సబ్‌డివిజన్ పరిధిలో పంచాయతీ రాజ్ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గొట్టాపు సందీప్‌లు స్థానిక సర్పంచ్‌లతో దురుసుగా ప్రవర్తించారని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. చట్టాలకు అతీతంగా పనిచేస్తున్న అధికారుల తీరుపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేరంగి సర్పంచ్ సోముల లచ్చయ్య, మిలియా కంచూరు సర్పంచ్ రామయ్య, వైసీపీ నాయకులు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

శంబర జాతర ఆదాయం రూ.4.57 లక్షలు

విశాలాంధ్ర - మక్కువ: ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత కోరిన కోర్కెలు తీర్చిన కల్పవలిగా పేరుగాంచిన శ్రీ సంబరపోలమాంబ, అమ్మవారి ఆరువ వారం జాతర ఆదాయం 4 లక్షల 57 వేల524 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వక అధికారి వివి సూర్యనారాయణ బుధవారం తెలిపారు. శీఘ్ర దర్శనం వంద రూపాయలు టికెట్ ద్వారా 1 లక్ష 35 వేల 500 రూపాయలు, ప్రత్యేక దర్శనం 20 రూపాయల టికెట్ ద్వారా 71 వేల 880 రూపాయలు, కేశఖండన ద్వారా 5800 రూపాయలు, మహా అన్నదాన విరాళాల ద్వారా 97 వేల 064 రూపాయలు, లడ్డు ప్రసాదాలు 94 వేల 080 రూపాయలు, పులిహోర ప్రసాదం ద్వారా 53 వేల 200 రూపాయలు వచ్చినట్లు, వెల్లడించారు గత సంవత్సరం కంటే ప్రస్తుత సంవత్సరం 1 లక్ష 42 వేల 296 రూపాయలు తగ్గినట్లు వెల్లడించారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ఎంపీడీఓ కుమార్

విశాలాంధ్ర - అనంతగిరి: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు సేవలందించాలని ఎంపీడీఓ కుమార్ అన్నారు. మండలంలోని ఎగువశోభ సచివాలయన్ని బుధవారం అనంతగిరి ఎంపీడీవో ఎవివి కుమార్ సందర్శించారు. ముఖ్యంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయంపై తనిఖీ చేస్తున్నామని తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు

మండలంలో ప్రతి వారం నాలుగు సచివాలయాలను తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలిస్తామని తెలిపారు. మండలంలో ప్రతి సచివాలయ ఉద్యోగి తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రాధాన్యత సర్వేలపై కూడా నిర్లక్ష్యం చేయకుండా నిర్దేశించిన సమయాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగువ శోభ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

విశాలాంధ్ర - సీతంపేట: మండలం పూతికవలస సచివాలయాన్ని ఎంపీడీఓ గీతాంజలి సందర్శించారు. సిబ్బంది హాజరు, గ్రామ వార్డు సచివాలయ సర్వేల పురోగతి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆశ్రమ పాఠశాల ప్రహరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కీసరజోడు, చిన్నబగ్గ, మర్రిపాడు పంచాయతీల్లో జరుగుతున్న రోడ్డు పనులను పర్యవేక్షించారు.

ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలి

విశాలాంధ్ర - గంగవరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మహిళలకు ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు ఐ.వి.రమణ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మా శ్రామిక మహిళా పోరాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం గంగవరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యే అన్నారు సంపూర్ణ మద్యపానషేధం అమలుపరిచి మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పి ఓ డబ్ల్యు డివిజన్ నాయకురాలు సత్యవతి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన రంపచోడవరంలో ప్రపంచ శ్రామిక మహిళా పోరాట వారోత్సవాల్లో భాగంగా భారీ బహిరంగ సదస్సు నిర్వహించడం జరుగుతుందని, ఈ సదస్సుకు రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని ఆదివాసీ మహిళా సంఘాల నాయకులు ,ప్రజాసంఘాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండల నాయకులు వెంకటలక్ష్మి ,పోచమ్మ, చంద్రమ్మ, చిలకమ్మ, లావణ్య, పూజిత, అమృత ,కీర్తన, నూకారెడ్డి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - వి. ఆర్. పురం: మండల కేంద్రం బీసీ కాలనీ లో ఇటీవల గ్రామస్తులు కాళ్ళ నొప్పులతో జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో మండల కూటమి నాయకులు ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓడాక్టర్ పుల్లారావు తో మాట్లాడి బుధవారం బిసి కాలనీలో డాక్టరు అనీల్ కుమార్ ఆధ్వర్యంలోవైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. అలాగే ఆర్డబ్ల్యూఎస్ వారిచే గ్రామంలో ఉన్నటువంటి చేతి బోర్ల వద్ద వాటర్ శాంపిల్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్రా ్ర నరేష్ కుమార్ మాట్లాడుతూ బీసీ కాలనీ ప్రజలకు కాళ్ళనొప్పులు జ్వరాలు అదుపులోకి తెచ్చి అవసరమైతే మరిన్ని వైద్య శిబిరాలనిర్వహణకుకృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఐటిడిపి మండల కన్వీనర్ ముత్యాల సిద్ధార్థ, మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, నాయకులు బోర్ర ఆది బొర్రా సూరిబాబు, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమానత్వం, సాధికారత ఎక్కడ..?

విశాలాంధ్ర - సీతానగరం: స్వాతంత్రము వచ్చి 75 ఏళ్ళు గడుస్తున్న మహిళలకు సమానత్వం సాధికారిక ఎక్కడని ఐద్వా నాయకురాలు రామలక్ష్మి బుధవారం నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శైలజ అధ్యక్షతన జరిగిన మహిళ సదస్సులోఐద్వా నాయుకురాలు వి.రామలక్ష్మి మాట్లాడారు. ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై, పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. మహిళలకు రక్షణగా ఉన్న 490ఏ చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన స్థానం కల్పించాలని భారత రాజ్యాంగంలో చెప్పడం తప్ప చాలా విషయాల్లో అమలు చేయడం లేదన్నారు. చట్టం ముందు అందరూ సమానులేఅని భారత శిక్షాస్మృతి స్పష్టం చేస్తుంది తప్ప ఆచరణలో జరగడం లేదన్నారు. చాలా మహిళా చట్టాలు అమలు జరగకపోవడం వల్ల మహిళలకు న్యాయం జరగడం లేదన్నారు. అందరూ మహిళల గూర్చి ప్రసంగాలు చేయడం తప్ప వాస్తవంగా వారికి చేపడుతున్న పథకాలు సంక్షేమం చాలా స్వల్పమేనన్నారు. పని ప్రదేశాలలో ఇతర చోట్ల మహిళా కార్మికులుకు అన్ని విధాల వేధింపులు ఎదుర్కొంటూ వాళ్లకి రక్షణ లేకుండా పోతుందన్నారు.ప్రభుత్వ సంస్థలు పరిశ్రమలలో తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణలేదన్నారు . ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, వై. శాంతి కుమారి, యం. సునీత, ఐద్వా నాయుకులు రెడ్డి లక్ష్మి, పార్వతి, శ్రామిక మహిళలు పాల్గొన్నారు.